



గవర్నర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న చిన జీయర్‌స్వామి, వేదపండితులు

రోప్ స్కిప్పింగ్‌లో అక్కాచెల్లెళ్ల ప్రతిభ

జాతీయ స్థాయిలో విజేతలుగా మంతన్‌గౌరెల్లి బాలికలు



యాచారం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి రోప్‌స్కిపింగ్ (అండర్-19)లో ప్రతిభ చాటిన అక్కాచెల్లెళ్లను రాష్ట్ర స్పోర్ట్స్ అథార్టి చైర్మన్ శివసేనరెడ్డి అభినందించారు. యాచారం మండలం మంతన్‌గౌరెల్లికి చెందిన శ్రీసింధు, శ్రీబిందులు ఉప్పల్‌లోని కేంద్రీయ విద్యాలయంలో పదోతరగతి చదువుతున్నారు. వీరిద్దరు జాతీయ స్థాయి రోప్‌స్కిప్పింగ్ అండర్-19 పోటీలు బెంగళూర్, ముంబయి, లక్నో, జమ్మూ కశ్మీర్, యానాకులం, భూపాల్, జైపూర్, గోహతి, రాంచి, కోల్‌కతా తదితర రాష్ట్రాల ఆటగాళ్లను ఇటీవల సికింద్రాబాద్‌లోని పికెట్‌లో జరిగిన ఫైనల్లో ఓడించారు. వీరిని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి శనివారం ఉప్పల్ కేంద్రీయ విద్యాలయానికి వెళ్లి ఘనంగా సత్కరించారు. బాలికల తల్లిదండ్రులు జ్యోతి, జైపాల్ కూడా ఆనందం వ్యక్తం చేశారు.

'సీపీఎస్‌ను రద్దు చేయాలి'

శంకర్‌పల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): సీపీఎస్‌ను రద్దు చేయాలని పీఆర్టీయూ మండలాధ్యక్షుడు మాణిక్యం కోరారు. శంకర్‌పల్లిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నగరంలోని ఇందిరాపార్కు వద్ద నేడు(సోమవారం) ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టే ధర్నా కార్యక్రమానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

చేపల పెంపకానికి ప్రోత్సాహం

వంద శాతం ఎస్టీలున్న 60 గ్రామాల ఎంపిక



జిల్లాలో నీలి విప్లవం తీసుకొచ్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుంది. మత్స్యకారులు, చేపల పెంపకంపై ఆసక్తి ఉన్నవారిని ప్రోత్సహించేందుకు చర్యలు చేపడుతోంది. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద 15 రకాల యూనిట్లకు ఆర్థిక సహాయం అందించేందుకు నిర్ణయించింది. జిల్లాలోని మహేశ్వరం, చేవెళ్ల, షాద్‌నగర్, కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 21 మండలాల్లో 60 తండాలలో నివసిస్తున్న గిరిజనులకు 90 శాతం సబ్సిడీ ద్వారా వివిధ రకాల యూనిట్లు అందిస్తుంది. మిగతా పది శాతం వాటాను లబ్దిదారులు చెల్లించాల్సి ఉంటుంది. ఎంపిక చేసిన గ్రామాల్లో ఔత్సాహిక ఎస్టీల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు.



ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా ఎస్టీలకు అందిస్తున్న యూనిట్లు ఇవే (లక్షల్లో)

భాగం	యూనిట్ కాస్ట్	సబ్సిడీ 90శాతం	లబ్ధిదారుడి వాటా 10 శాతం
ఐస్ బాక్స్‌తో సైకిల్	0.10	0.9	0.1
ఐస్ బాక్స్‌తో మోటర్ సైకిల్	0.75	0.675	0.75
ఐస్‌బాక్స్‌తో మూడు చక్రాల వాహనం	3.00	2.70	0.30
లైవ్ ఫిష్ వెండింగ్ సెంటర్	20.00	18.00	2.00
రిఫ్రిజిరేటెడ్ వెహికిల్స్	25.00	22.5	2.5
ఇన్సులేటెడ్ వెహికిల్స్	20.00	18.00	2.00
చెరువు నిర్మాణం కోసం	7.00	6.30	0.70
మంచినీటి ఆక్వాకల్చర్ కోసం ఇన్‌పుట్	4.00	3.60	0.40
చేపల చెరువుల నిర్మాణం	7.00	6.30	0.70
వలలు, పడవలు	5.00	4.50	0.50
చేప విలువ, ఉత్పత్తికి	50.00	45.00	5.00
స్మాల్ రాస్‌కు	7.5	6.75	0.75
మీడియం రాస్‌కు	25.00	22.5	2.5
లార్జ్ రాస్‌కు	50.00	45.00	5.00
కమ్యూనిటీ ఆధారిత కార్యకలాపాలు			
ఫిష్ రిటైల్ మార్కెట్‌కు	100.00	90.00	10.00
శిక్షణ అవగాహన, కెపాసిటీ బిల్డింగ్	1.50	-	-
ఐస్ ప్లాంట్లు, కోల్డ్ స్టోరేజీ	40.00	36.00	4.00

- 15 రకాల యూనిట్లకు ఎస్టీలకు 90 శాతం రాయితీ
- పీఎం మత్స్య సంపద యోజన కింద దరఖాస్తుల ఆహ్వానం

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద విత్ సైకిల్‌తో ఐస్ బాక్స్ మోటర్ సైకిల్ విత్ ఐస్‌బాక్స్, త్రీవీలర్‌తో ఐస్‌బాక్స్, లైవ్ ఫిష్ వెండింగ్ సెంటర్‌కు రాయితీ కల్పిస్తుంది. రిఫ్రిజిరేటర్‌తో వాహనం, ఇన్సూలేటెడ్‌తో వాహనం, చేపలు పెంచేందుకు చెరువుల నిర్మాణం, వలలు, పడవలకు రాయితీ కల్పిస్తుంది. కమ్యూనిటీ ఆధారిత కార్యకలాపాల్లో రిటైల్ చేపల మార్కెట్ ఏర్పాటు, శిక్షణ, అవగాహన, కెపాసిటీ భవనం, ఐస్ పాయింట్లు, కోల్డ్ స్టోరేజీల ఏర్పాటుకు 90శాతం సబ్సిడీ కల్పిస్తుంది. మిగతా పది శాతం వాటాను ఎస్టీలు చెల్లించాల్సి ఉంటుంది. మత్స్యరంగంపై ఆధారపడే గిరిజనులకు అవకాశం కల్పిస్తుంది. ఎంపిక చేసిన గ్రామాల్లో ఔత్సాహిక ఎస్టీల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. మత్స్య సంపదపై ఆధారపడిన

మిగతా 8వ పేజీలో...

ఆపరేషన్ సిందూర్‌తో సత్తా చాటాం

భారత్ సూపర్ పవర్‌గా ఎదుగుతోంది

సమానత్వం కోసం రామానుజుల కృషి అభినందనీయం

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

నేత్ర విద్యాలయ 18వ వార్షికోత్సవానికి హాజరు



మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

శంషాబాద్ రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి మన సత్తా చాటామని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. ఆదివారం శంషాబాద్ మండలం ముచ్చింతల్ సమతా మూర్తి కేంద్రంలో జరిగిన నేత్ర విద్యాలయ 18వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీత్రిదండి రామానుజ చినజీయర్‌స్వామి, వేదపండితులు గవర్నర్‌కు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత్‌లో తయారైన మిస్సైల్‌తో పాకిస్థాన్‌కు ముచ్చెమటలు పట్టించామని చెప్పారు. ముమ్మందు భారత్ సూపర్ పవర్‌గా ఎదుగుతోందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆధ్వర్యంలో దేశం అనేక సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటుందని తెలిపారు. వెయ్యేళ్ల క్రితమే శ్రీ రామానుజాచార్యులు సమసమాజం కోసం ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. నేటి సమాజంలో చిన జీయర్‌స్వామి ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన ఆపరేషన్ సిందూర్ కార్యక్రమం ఎంతో ఆకట్టుకుందని గవర్నర్ చెప్పారు. అనంతరం చిన జీయర్‌స్వామి గవర్నర్‌కు తీర్థప్రసాదాలు, మంగళశాసనములు అందజేశారు. చిన జీయర్‌స్వామి మాట్లాడుతూ... నేత్ర విద్యాలయ వార్షికోత్సవానికి వచ్చిన గవర్నర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ విద్యాలయంలో చదివిన విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ చాటారని చెప్పారు. ఇక్కడి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని చెప్పారు. క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని స్వామిజీ తెలిపారు. అంధ విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అహోబిల జీయర్‌స్వామి, దేవానాథ జీయర్ స్వామి, మైహోం గ్రూప్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు, జగపతిరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిన జీయర్‌స్వామి

వినాయకుడికి విశేష పూజలు



ఆమనగల్లులో వినాయకుడి మండపంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

పార్వతీ తనయుడు గణపయ్య భక్తులచే విశేష పూజలందుకుంటున్నాడు. జిల్లావ్యాప్తంగా గణేశ్ నవరాత్రోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. పలు వినాయక మండపాల వద్ద ఐదో రోజు ఆదివారం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమాలలో ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కొన్ని ప్రాంతాల్లో గణపతి విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేశారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, ఆగస్టు 31

యూరియా కోసం బారులు



మంచాల పీఏసీఎస్ వద్ద యూరియా కోసం అన్నదాతల క్యూ

ఆమనగల్లు/ మంచాల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులకు పాట్లు తప్పడం లేదు. ఆమనగల్లు పట్టణంలోని వాసవి ఫర్టిలైజర్ దుకాణం ఎదుట ఆదివారం ఉదయాన్నే యూరియా కోసం బారులు దీరారు. ఈ నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒక దశలో తోపులాట జరిగింది. ఎస్ఐ వెంకటేశ్ చేరుకొని బందోబస్తు నడుమ రైతులకు యూరియా సరఫరా చేశారు. రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియా అందజేశారు. మంచాల మండలంలోనూ యూరియా కోసం అన్నదాతలు తిప్పలు పడుతున్నారు. రెండు రోజుల క్రితమే మంచాల పీఏసీఎస్‌లో 444 బస్తాలు పంపిణీ చేశారు. మళ్లీ ఆదివారం మరో 450 బస్తాలు రాగా, ఉదయం నుంచే రైతులు క్యూలో వేచిఉండి యూరియా కొనుగోలు చేసి తీసుకెళ్లారు. మంచాల మండల పరిధిలో 14వేల ఎకరాల సాగుభూమి ఉండగా, తొలకరి నాటికి 4వేల ఎకరాలు మాత్రమే పంటలు సాగు చేశారు. కాగా, ఇటీవల మోస్తరు వర్షాలకు కొంచెం నీటి లభ్యత పెరగడంతో రైతులందరూ తమకు అనుకూలమైన పంటలు సాగులోకి తెచ్చారు. ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో వ్యవసాయ అధికారులు ఈ ఆకస్మిక పరిణామాన్ని అంచనా వేయలేకపోయారు. దీంతో వివిధ గ్రామాల్లో యూరియా కొరత ఏర్పడింది.

ప్రీప్రైమరీ తరగతులకు ఇన్‌స్ట్రక్టర్లు

- చిన్నారుల బాగోగులు చూసేందుకు ఆయాలు
- 6వ తేదీ వరకు దరఖాస్తులకు అవకాశం
- జిల్లాలో 72 ప్రీప్రైమరీలో నాలుగేళ్లు ఆపై వయస్సున్న పిల్లలకు అడ్మిషన్లు
- సద్వినియోగం చేసుకోవాలి : డీఈవో సుశీంద్రరావు



రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎంపిక చేసిన ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతుల బోధనలకు ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రీప్రైమరీ తరగతులు నిర్వహించే 72 పాఠశాలల్లో వారిని నియమించనున్నారు. ఒక్కో పాఠశాలలో ఒక్కో ఇన్‌స్ట్రక్టర్, ఆయాను నియమించనున్నారు. ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు కనీస అర్హత ఇంటర్, ఆయా పోస్టులకు కనీస విద్యార్హత 7వ తరగతి ఉండాలని నిర్ణయించారు. 18 ఏళ్ల నుంచి 44 ఏళ్లలోపు వయసున్న అభ్యర్థులు అర్హులు. ఎంపిక చేసిన 72 పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభించనున్నారు. ఇందుకోసం నాలుగేళ్లు ఆపై వయసు ఉన్న పిల్లలను ప్రీ ప్రైమరీలో అడ్మిషన్ పొందేందుకు అర్హులు. ఎంపికైన ఇన్‌స్ట్రక్టర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తిగల స్థానిక మహిళా అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆయా మండల కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలని జిల్లా విద్యాధికారి సుశీంద్రరావు తెలిపారు.

'జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి'

షాబాద్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని సీతారాంపూర్, పోతుగల్ గ్రామాల్లో బీసీ సేన గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీల హక్కుల సాధనకు బీసీలంతా సంఘటితం కావాలన్నారు. మండల అధ్యక్షుడు దయాకర్‌చారి, ఉపాధ్యక్షుడు బాల్‌రాజ్, యూత్ అధ్యక్షుడు అజయ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

పల్లెల్లో స్థానిక సందడి

గ్రామాల్లో వేడెక్కుతున్న రాజకీయం

రిజర్వేషన్లపై ఆశావహుల్లో టెన్షన్

అగ్రనేతల ప్రాపకానికి పాకులాట



ఆమనగల్లు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతుండడంతో కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల పరిధిలోని గ్రామాల్లో రాజకీయం వేడెక్కుతోంది. సెప్టెంబర్ రెండో వారంలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ రానుందనే సమాచారంతో పల్లెల్లో వివిధ రాజకీయ పార్టీల నాయకుల హడావిడి మొదలైంది. జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల పదవులపై ఆశలు పెంచుకున్న మండల, గ్రామ స్థాయి నాయకులు ఎన్నికలకు సన్నద్ధమవుతున్నారు. తమ పార్టీల అగ్రనేతల ప్రాపకం కోసం బరిలో నిలిచే నేతలు ఎత్తుగడలు సాగిస్తున్నారు. మరోవైపు ఈసారి ఎన్నికల నిర్వహణకు ఖర్చు కూడా బాగానే ఉంటుందని

మిగతా 8వ పేజీలో...

నాలుగు మండలాల్లో 102 పంచాయతీలు

ఆమనగల్లు మండలంలో 13, మాడ్గులలో 33, కడ్తాలలో 24, తలకొండపల్లిలో 32 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అదే విధంగా నాలుగు మండలాల పరిధిలోని 41 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. గత ఎన్నికల్లో ఆమనగల్లు, కడ్తాల ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు ఎస్టీలకు, మాడ్గుల, తలకొండపల్లి మండలాల్లో ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు జనరల్‌కు కేటాయించారు. అప్పట్లో నాలుగు మండలాల ఎంపీపీ స్థానాలు రిజర్వేషన్లలో భాగంగా మహిళలకే కేటాయించడం జరిగింది. ఈసారి ఎలా ఉంటుందోనని రాజకీయ చర్చ సాగుతుంది. మరో వైపు స్థానిక సమరానికి ప్రధాన రాజకీయ పార్టీలు సన్నాహాలు చేస్తున్నాయి.



సిల్వర్ మెడల్‌ను అందుకుంటున్న గౌండ్ల వరుణ్‌గౌడ్

అథ్లెటిక్‌లో మెరిసిన కొందాకల్ విద్యార్థి

డిస్కస్ త్రో, షాట్‌పుట్‌లో సిల్వర్ మెడల్స్ సాధించిన వరుణ్‌గౌడ్

శంకర్‌పల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): 11వ రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్ చాంపియన్ షిప్-2025 పోటీలలో కొందాకల్ విద్యార్థి గౌండ్ల వరుణ్‌గౌడ్ ప్రతిభ కనబరిచాడు. మహబూబ్‌నగర్‌లోని పాలమూరు యూనివర్సిటీలో ఆగస్టు 30, 31 తేదీలలో జరిగిన డిస్కస్ త్రో, షాట్‌పుట్ విభాగాలలో (అండర్-18) వరుణ్‌గౌడ్ సిల్వర్‌మెడల్స్ సాధించారు. ఇతను బాసర ఐఐటీలో రెండవ సంవత్సరం చదువుతున్నాడు. ఈ సందర్భంగా వరుణ్‌గౌడ్ తల్లిదండ్రులు కల్పన, లక్ష్మణ్ గౌడ్ సంతోషం వ్యక్తం చేశారు.

అడుగుకో గుంత.. ప్రయాణమెట్లా? 8



కాంగ్రెస్ పార్టీలో సేవాదళ్ పాత్ర కీలకం 7



కల్వర్టుపై గుంతల్లో నిలిచిన నీరు

గుంతలతో వాహనదారుల ఇబ్బందులు

దుద్యాల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):మండలంలోని హకీంపేట్ శివారులో కల్వర్టుపై గుంతలేర్పడి వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కోస్గి రోడ్డులో ఉన్న కల్వర్టుపై గుంతలు ఏర్పడటంతో వర్షపు నీరు నిలుస్తోంది. వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగించే రోడ్డులో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు వెంటనే మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

యూరియాను అందించడంలో కేంద్రం విఫలం



సోమారపు రవి

మోమిన్‌పేట్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా అందించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ ఎస్సీసెల్ చేవేళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి సోమారపు రవి ఆరోపించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇవ్వాల్సిన యూరియా కోటాను తగ్గించడం వల్లే రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందన్నారు. బీఆర్ఎస్ నాయకులు రైతులను తప్పుదోవ పట్టించేందుకు ఆందోళనలు చేస్తున్నారన్నారు. వానకాలం సీజన్ వరకు 8.30లక్షల టన్నుల యూరియాను ఇవ్వాల్సి ఉండగా కేంద్రం ఇప్పటి వరకు 5.72లక్షల టన్నులే ఇచ్చిందన్నారు. దీంతో యూరియా కొరత ఏర్పడుతుందన్నారు.

కలర్ చాంప్-2025 పోటీలు

- మా హైదరాబాద్ 2025 థీమ్‌తో నిర్వహణ
- ఊహాత్మక చిత్రాలు గీసి ఆకట్టుకున్న బాలబాలికలు



శైలజారెడ్డి, దినేష్‌విక్టర్‌లకు స్వాగతం పలుకుతున్న నిర్వాహకులు

శంషాబాద్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): శంషాబాద్‌లోని ఎస్సార్ క్లాసిక్ కన్వెన్షన్‌లో ఆదివారం గ్లోబల్ ఆర్ట్ అకాడమి 'కలర్ చాంప్ -2025' పోటీలను నిర్వహించింది. నగరంలోని 26 పాఠశాలల నుంచి 570 మంది విద్యార్థులు ఈ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్నారు. తమ శిక్షణను బట్టి గంటపాటు ఊహా చిత్రాలను గీసేందుకు సమయమిచ్చి పోటీలు నిర్వహించారు. 'నా నగరం హైదరాబాద్ 2025' అనే థీమ్‌తో పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ఉప్పల్ మెరీడియన్ స్కూల్ ప్రిన్సిపాల్ శైలజారెడ్డి ముఖ్య అతిథిగా, విశిష్ట అతిథిగా ఎస్ఐపీ అకాడమీ ఎండీ దినేష్‌విక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సృజనాత్మక కళల్లో పాల్గొనే విద్యార్థుల్లో సమస్యల పరిష్కార నైపుణ్యాలు, భావోద్వేగ ధైర్యం పెరుగుతాయని తెలిపారు. స్కిల్ డెలవప్‌మెంట్ ప్రోగ్రాంలపై ప్రభుత్వం జీఎస్టీని మినహాయించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్ట్, అబాకస్, డ్యాన్స్, మ్యూజిక్, యోగా, లాంగ్వేజెస్ అనేవి లగ్జరీలు కావని, విద్యార్థుల్లో స్కిల్స్ పెంపొందించే కార్యక్రమాలన్నారు. ఎగిరే ఆటోలు, ఇంద్ర ధనస్సు, రంగుల సరస్సులు, రోబో పోలీసులు డ్రోన్ బిర్యానీలు.. ఇలా రకరకాల ఆర్ట్ నైపుణ్యాన్ని విద్యారులు ప్రదర్శించారని తెలిపారు. ఇలాంటి పోటీలతో పిల్లల్లోని ప్రతిభ వెలికి వస్తుందని, నైపుణ్యాలను మెరుగుపర్చుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. అలాగే పిలల్లో పోటీ తత్వం పెరిగి జీవితంలో ఎదిగేందుకు దోహదం చేస్తాయన్నారు.



ఆర్ట్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



తాను గీసిన ఊహాచిత్రాన్ని చూపుతున్న బాలిక

ఇచ్చిన మాట ప్రకారం గ్యారెంటీల అమలు

వికారాబాద్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేస్తోందని, ఇల్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తామని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం వికారాబాద్‌లోని మద్గుల్ చిట్టంపల్లి, గుడుపల్లికి చెందిన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు ప్రొసీడింగ్‌లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. తాము పట్టణాన్ని అభివృద్ధి చేస్తామని, ప్రజల కోసం పరితపించే నాయకుడు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆయన మన ఎమ్మెల్యే కావడం అదృష్టమన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, మల్లయ్య, వెంకటయ్య గౌడ్, బందయ్య, రామకృష్ణారెడ్డి, రాములు, లాలయ్య, నర్సిములు, జమీల్, ఈశ్వర్, రాములు పాల్గొన్నారు.



ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేస్తున్న కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి

చెన్నారంలో తాగునీటి ఎద్దడి

● పట్టించుకోని అధికారులు ● మహిళల ఆందోళన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

యాలాల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): తమకాలనీలో తాగునీరు రావడంలేదని చెన్నారం గ్రామస్థులు ఆదివారం ఆందోళనకు దిగారు. పానాదుల గల్లీలో రెండు రోజులుగా తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి తనకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. కొందరు గ్రామస్థులు అధికారులకు ఫోన్ చేసి సమస్యపై సమాచారమిచ్చారు. పానాదుల గల్లీకి వెంటనే నీళ్లు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.

ఆలయ ఆవరణలో సిమెంట్ బెంచీల ఏర్పాటు



ఆలయ ఆవరణలో సిమెంట్ బెంచీలపై కూర్చున్న గ్రామస్థులు

తలకొండపల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):దేవుని పడకల్ గ్రామంలో మాజీ సర్పంచ్ కాడెమోని శ్రీశైలం ఆధ్వర్యంలో సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. తన తండ్రి సాయన్న జ్ఞాపకార్థం రూ.31వేలతో సమకూర్చిన 12సిమెంట్ బెంచీలను బస్టాండ్, వేంకటేశ్వర ఆలయ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేశారు. గ్రామస్థులు శ్రీశైలంను అభినందించారు. నాయకులు రామస్వామి, సత్యం, లక్ష్మయ్య, నవీన్, శంకర్, యాదయ్య, బాలయ్య, వెంకటయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

పట్టణాలకు దీటుగా గ్రామాల అభివృద్ధి

తలకొండపల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పట్టణాలకు దీటుగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేస్తూ వసతులు కల్పిస్తుందని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ అన్నారు. తలకొండపల్లి మండలం వెల్జాలలో ఎంపీ మల్లు రవి సహకారంతో రూ.3లక్షలతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఆదివారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కాసు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసమూర్తిలతో కలిసి ఆయన ప్రారంభించారు. గ్రామీణ పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం సాధ్యం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అంబాజీ, నాయకులు వెంకట్‌రెడ్డి, ఆరిఫ్, అశోక్, రవి, శ్రీశైలం, రమేశ్, రేణురెడ్డి, వెంకట్‌రెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.



హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న యాట నర్సింహ

కార్మికులకు రెగ్జిన్ జాకెట్ల పంపిణీ



రెగ్జిన్ జాకెట్‌లను పంపిణీ చేస్తున్న కమిషనర్ యాదగిరి

తాండూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ఆదివారం మున్సిపల్ కమిషనర్ యాదగిరి రెగ్జిన్ జాకెట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పట్టణాన్ని పరిశుభ్రంగా మార్చడంలో కార్మికులది కీలక పాత్ర అని కొనియడారు. వార్డుల్లో తిరుగుతూ చెత్తను తొలగించాలని సూచించారు. కార్మికులకు డ్రెస్‌కోడ్ ఉండాలనే జాకెట్లు పంపిణీ చేశామన్నారు. మున్సిపల్ డీఈ మణిపాల్, ఏఈ హుస్సేన్, మేనేజర్ నరేందర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వెంకటయ్య, ఉమేశ్ పాల్గొన్నారు.

రెడ్డి సంఘం అధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డి

ఘట్‌కేసర్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ రెడ్డి సంఘం అధ్యక్షుడిగా సీహెచ్.వెంకట్‌రెడ్డి ఎన్నికయ్యారు. సంఘం అధ్యక్ష పదవికోసం ఆదివారం జరిగిన ఎన్నికల్లో వెంకట్‌రెడ్డి, కె.మాధవరెడ్డి పోటీపడ్డారు. ఇందులో వెంకట్‌రెడ్డి 82ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా శివప్రదీప్‌రెడ్డి, ఉపాధ్యక్షులు పి.శ్రీకాంత్‌రెడ్డి, ఎస్.శ్రీకాంత్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా లక్ష్మారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా రవీందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సంఘం ప్రతినిధులు అభినందించారు.



ఘట్‌కేసర్ రెడ్డి సంఘం నూతన కార్యవర్గంతో సంఘ ప్రతినిధులు

మంచం పట్టిన మాజీ సర్పంచ్

● చేసిన పనులకు బిల్లులు రాక మనోవేదన

మర్పల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : సర్పంచ్‌గా గ్రామంలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రాకపోవడంతో మనస్తాపానికి గురైన వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల పరిధిలోని మల్లికార్జునగిరి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ లక్ష్మయ్య మంచాన పడ్డాడు. ఈయన 2019 జనవరిలో జరిగిన ఎన్నికల్లో గ్రామ సర్పంచ్‌గా గెలుపొందారు. అదే సంవత్సరం గ్రామం నూతన పంచాయతీగా మారడంతో అభివృద్ధి చేసేందుకు కృషి చేశారు. 2022-23లో సీసీ రోడ్ల నిర్మాణానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సీడీఎఫ్ కింద రూ.5 లక్షలు మంజూరు చేసింది. అప్పు చేసి ఆ పనులు పూర్తి చేశాడు. గ్రామంలో వైకుంఠ ధామం నిర్మాణానికి మరో రూ.12లక్షలు మంజూరు కాగా ఎంబీలు రికార్డు చేసి అధికారులకు అందించారు. దీంట్లో కేవలం రూ.5లక్షలు మంజూరు కాగా మిగతా డబ్బుల కోసం అధికారుల చుట్టూ తిరిగి అలసిపోయాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై అనారోగ్యంతో మంచాన పడ్డాడు. మూడు నెలలుగా ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ రూ.15లక్షల వరకు అప్పు చేసి ఖర్చు పెట్టినా ఆరోగ్యం కుదుటపడలేదు. తనకున్న రెండెకరాల భూమిని సైతం తాకట్టు పెట్టి రూ.10లక్షల అప్పు చేశానని, భార్య బంగారు నగలను తాకట్టు పెట్టి మరో రూ.3లక్షల అప్పు చేశానని లక్ష్మయ్య కన్నీరుమున్నీరవుతున్నాడు. కుమార్తె ఉన్నత చదువుల కోసం హైదరాబాద్ కళాశాలకు వెళ్లగా డబ్బులు కట్టలేని స్థితిలో చదువు మధ్యలోనే ఆపేసినట్లు లక్ష్మయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా ప్రభుత్వం పెండింగ్ బిల్లులను అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.



అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ సర్పంచ్ లక్ష్మయ్య

బీసీ రిజర్వేషన్ల తీర్మానం అభినందనీయం

కొడంగల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు అమలుచేస్తూ ఆదివారం అసెంబ్లీలో తీర్మానించడం అభినందనీయమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బల్ల యాదగిరి పటేల్ అన్నారు. ఆదివారం మద్దూర్‌లో విలేకరులతో మాట్లాడారు. బీసీ జనాభా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని సంవత్సరాలైనా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌లు లేకపోవడం దురదృష్టకరం అన్నారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని అమలు చేస్తుడటం గొప్ప విషయం అన్నారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు మన్నె బస్వరాజ్, నర్సయ్య, చంద్రశేఖర్‌గౌడ్, నాగప్ప పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పాఠశాలలో విద్యుత్ సమస్య పరిష్కారం

బొంరాస్‌పేట్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): బొంరాస్‌పేట్ మండలంలోని మేడిచెట్టు తండా పంచాయతీ పరిధిలోని బోడబండ తండా పాఠశాలలో విద్యుత్ సమస్యను స్థానిక నాయకులు పరిష్కరించారు. పాఠశాలకు విద్యుత్ సౌకర్యం లేదని అంగన్‌వాడీ టీచర్ కాంగ్రెస్ నాయకుల దృష్టికితీసుకెళ్లారు. స్పందించిన మోహన్‌నాయక్, వనిఓద్‌నాయక్, రాజునాయక్, నవీన్‌నాయక్‌లు ఆదివారం పాఠశాలకు విద్యుత్ కనెక్షన్ ఇప్పించి లైట్లు వేయించారు. తండా వాసులు, టీచర్లు నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.



సంచార జాతుల విముక్తి దినోత్సవంలో పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న లక్ష్మణ్

కనుమరుగవుతున్న సంచార జాతుల కళలు

» ప్రధాని మోదీ ఆదేశాలతో విముక్తి దినోత్సవం: కె.లక్ష్మణ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సంచార జాతుల విన్యాసాలు, హరి కథలు, బుర్ర కథలు వంటి సంప్రదాయ కళలు అంతరించిపోవడం దురదృష్టకరమని బీజేపీ రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీ దూర విద్య కేంద్రంలో నిర్వహించిన సంచార జాతుల విముక్తి దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడారు. ప్రధాని మోదీ సంచార జాతుల విముక్తి దినోత్సవ ప్రాముఖ్యతను గుర్తించి, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అధికారికంగా ఈ వేడుకను జరపాలని ఆదేశించారని తెలిపారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, హరియాణా, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో ఈ కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. తాను 1999లో మొదటిసారి శాసన సభ్యుడిగా ఎన్నికైనప్పుడు అసెంబ్లీలో సంచార జాతుల సమస్యలను ప్రస్తావించానని గుర్తు చేశారు. ఆ తర్వాతే అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు సంఘాలతో మాట్లాడి కులాల పేర్లను అధికారికంగా మార్చారని పేర్కొన్నారు. ఇటీవల తెలంగాణలో కాంగ్రెస్ చేసిన కుల గణన ఓటు బ్యాంకు దృష్టితో జరిగిందని, అందులో బీసీలకు, అణగారిన వర్గాలకు న్యాయం జరగలేదన్నారు. కులాల వారీ లెక్కలు అధికారికంగా రావాలంటే కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో జరిగే గణన ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సంచార జాతుల్లో కులాల లెక్కలు అధికారికంగా తేలితే బడ్జెట్ కేటాయింపులు, అభివృద్ధి ప్రణాళికలను స్పష్టంగా అమలు చేయవచ్చని లక్ష్మణ్ అన్నారు.

వివరణ ఇచ్చేందుకు 10 రోజుల గడువు ఇవ్వండి

» స్పీకర్‌ను కలిసి కోరిన కడియం, అరికెపూడి, దానం

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ ఫిర్యాదు మేరకు జారీ చేసిన నోటీసులపై విచారణకు హాజరై వివరణ ఇచ్చేందుకు తమకు పది రోజుల గడువు ఇవ్వాలంటూ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, అరికెపూడి గాంధీ, దానం నాగేందర్ కోరారు. అసెంబ్లీలోని స్పీకర్ కార్యాలయంలో ఆదివారం ఆయన్ను కలిసిన ముగ్గురు ఎమ్మెల్యేలు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. మిగిలిన ఎమ్మెల్యేలూ స్పీకర్‌ను కలిసి గడువు కోరనున్నట్లు తెలుస్తోంది. అనంతరం అసెంబ్లీ లాబీల్లో కడియం, అరికెపూడి గాంధీ మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ.. తాము వివరణ ఇచ్చేందుకు స్పీకర్‌ను పది రోజులు గడువు ఇవ్వాలని కోరినట్లు వెల్లడించారు. కాగా.. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లోకి మారిన పది మంది ఎమ్మెల్యేలపైన అనర్హత వేటు వేయాలంటూ గతంలోనే స్పీకర్‌కు ఫిర్యాదు ఇచ్చిన బీఆర్ఎస్.. ఈ అంశంపైన సుప్రీం కోర్టునూ ఆశ్రయించగా.. మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఇందులో భాగంగానే పది మంది ఎమ్మెల్యేలకూ స్పీకర్ కార్యాలయం నోటీసులు జారీ చేసింది.

ఆర్ఎఫ్‌సీఎల్ లో లీకేజీలకు ఎవరిది బాధ్యత..?

» రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎరువుల కర్మాగారం(ఆర్ఎఫ్‌సీఎల్)లో అమ్మోనియా పైప్‌లైన్ వరుస లీకేజీలకు బాధ్యత ఎవరిదని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రశ్నించారు. రామగుండంలో ఎరువుల కర్మాగారం నిర్మిస్తే రాష్ట్ర రైతాంగానికి యూరియా సకాలంలో అందుతుందని యూపీఏ ప్రభుత్వం ప్లాంట్ నిర్మాణానికి అనుమతినిచ్చిందని తెలిపారు. ప్లాంటు అవసరాలకు మిషన్ భగిరథ నీరు ఇస్తున్నామని, ఉత్పత్తిలో 50శాతం యూరియాను తెలంగాణకు కేటాయించాల్సిందేనని డిమాండ్ చేశారు. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచే ఈ సీజన్లో రాష్ట్రానికి రావాల్సిన 1.2లక్షల టన్నుల యూరియాను తగ్గించారన్నారు. ప్లాంట్‌లో నిర్మాణలోపాలు, అధికారుల నిర్లక్ష్యంపై సీబీఐతో విచారణ జరిపించాలని కేంద్రానికి లేఖ రాస్తానన్నారు.

కేటీఆర్.. ఓ మానసిక రోగి

ఉపరాష్ట్రపతి ఎన్నికకు యూరియాకు ఏం సంబంధం?.. ఎన్డీఏ అభ్యర్థికే ఓటేస్తామని చెప్పొచ్చుగా?

» నాపై 181 కేసులు బనాయించారు
» ఇల్లు కూల్చేశారు..నన్ను కిడ్నాప్ చేశారు
» చంద్రబాబుతో సంప్రదింపులు అబద్ధం
» 2029లో రాహుల్ గాంధీనే ప్రధాని
» 'ఇండియా టుడే' ఇంటర్వ్యూలో రేవంత్



న్యూఢిల్లీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక మానసిక రోగి అని, యూరియా ఇస్తేనే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఇస్తామనడం పిచ్చికి పరాకాష్ట అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. అనవసరంగా ఇలాంటి నాటకాలు ఎందుకని, ఎన్డీఏ అభ్యర్థికి మద్దతిస్తామని కేటీఆర్ చెప్పవచ్చు కదాని పేర్కొన్నారు. యూరియా ఇచ్చేది కేంద్రమని, అలాంటప్పుడు యూరియా ఇస్తేనే ఇండి కూటమి అభ్యర్థికి మద్దతు ఇస్తామని ఎలా అంటున్నారని నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో తనపై అక్రమంగా 181 కేసులు బనాయించారని, ఆ కేసులే తనకు మెడల్స్ అని చెప్పారు. తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక, గుజరాత్.. ఇలా అనేక రాష్ట్రాల్లో తెలుగు మాట్లాడే ఎంపీలు ఉన్నారని, వారంతా కలసి సుదర్శన్‌రెడ్డిని ఉప రాష్ట్రపతిగా గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇటీవల సీఎం రేవంత్‌ను ఇండియా టుడే ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చేసింది. అందులో రేవంత్ ఆసక్తికర అంశాలను వెల్లడించారు.

బీఆర్ఎస్ పతనావస్థకు చేరింది..

గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అవయవదానం చేసి బీజేపీని 8 సీట్లలో గెలిపించిందని రేవంత్ చెప్పారు. బీఆర్ఎస్ పుట్టినప్పటి నుంచి ఒక్క పార్లమెంట్ సీటైనా గెలిచిందని, ఇప్పుడు ఘోరంగా పతనావస్థకు చేరిందన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్‌లోనూ బీజేపీనే గెలిచిందన్నారు.

కేసులతో ఖతం చేయాలని చూశారు..

ప్రజల కోసం ప్రశ్నించిన ప్రతిసారి తనపై కేసులు పెట్టారని, అలా కేసులు పెట్టిన ప్రతిసారీ తనకు ప్రజల్లో మద్దతు పెరిగిందని రేవంత్ చెప్పారు. "నాపై 181 అక్రమ కేసులు పెట్టారు. ఎప్పటికైనా తన ప్రత్యర్థిని నేనేనని కేసీఆర్‌కు తెలుసు. అందుకే నన్ను హింసించేందుకు అన్ని ప్రయత్నాలు చేశారు. నాపై క్రిమినల్ కేసులు పెట్టి ఖతం చేయాలని చూశారు. ఎన్నికల సమయంలో నా ఇల్లు కూల్చేశారు. నన్ను కిడ్నాప్ చేశారు. మూడు నెలలకే ఎంపీగా గెలిచి ఢిల్లీకి వచ్చా. ఈ రోజు సీఎం అయ్యా" అని తెలిపారు.

రాజకీయ లబ్ధి కోసమే ఆ బిల్లు..

ఏదైనా కేసులో అరెస్టయి 30 రోజులకుపైగా జైలులో ఉన్న సీఎంలు, మంత్రులను పదవి నుంచి తప్పించే బిల్లును రేవంత్‌రెడ్డి తప్పుబట్టారు. రాజకీయంగా లబ్ధి పొందేందుకే దానిని తీసుకువచ్చారని ఆరోపించారు. "ప్రస్తుతం విపక్ష సీఎంలను టార్గెట్ చేసి కేసులు పెట్టడం చూస్తున్నాం. చిన్న అంశాల్లోనూ 30 రోజులు జైల్లో పెట్టొచ్చు. ఇదేమీ అంత పెద్ద విషయం కాదు. కొత్త బిల్లు చట్టంగా మారాక ఢిల్లీ ఆదేశాలను అమలు చేయకపోతే.. రాష్ట్రాల సీఎంలు ఎవరైనా పదవి వదులుకోవాల్సి వస్తుంది. ఈ అంశంపై యోగి ఆదిత్యనాథ్ సహా బీజేపీ సీఎంలే ఆందోళన చెందుతుంటే.. మిగతా సీఎంల పరిస్థితి ఏమిటి?" అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అలాగని తానేమీ భయపడటం లేదని, తానెలాంటి తప్పూ చేయలేదని చెప్పారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలానికి మద్దతివ్వకపోతే ఖతం చేయడమే వాళ్లకు తెలుసని ఆరోపించారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డిపై అమిత్‌షా వ్యాఖ్యలు అత్యంత దారుణమని మండిపడ్డారు.

చంద్రబాబుతో సంప్రదింపులు అవాస్తవం

2024లో కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వ ఏర్పాటు సమయంలో చంద్రబాబుతో తాను సంప్రదింపులు జరిపాననేది అవాస్తవ ప్రచారమని రేవంత్ స్పష్టం చేశారు. తానెప్పుడూ అటువంటి ప్రయత్నం చేయలేదన్నారు. అలాంటి రాజకీయాలను రాహుల్ గాంధీ విశ్వసించరని.. ఆయన అలా అనుకుంటే ఎప్పుడో ప్రధాని అయ్యేవారని చెప్పారు. చంద్రబాబు సీనియర్ రాజకీయవేత్త అని, రాజకీయ ఎత్తుగడల్లో ఆయనకు మించిన వారెవరూ లేరని పేర్కొన్నారు. చంద్రబాబును తాను గౌరవిస్తానని, కానీ తనకు పార్టీ, తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యమని చెప్పారు. తన రాజకీయ అంచనాలు ఎప్పుడూ తప్పలేదని.. 2029లో రాహుల్ గాంధీనే ప్రధాని అని, కావాలంటే రాసిపెట్టుకోవాలని రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రధాని మోదీకి 2029 ఎక్స్‌పైరీ తేదీ అన్నారు. తాను బీజేపీలో పనిచేయలేదని, ఏబీవీపీలో పనిచేశానని.. బీజేపీ రాజకీయ పార్టీ అని, ఏబీవీపీ విద్యార్థి సంఘమని వివరించారు. తాను ఇప్పుడు కాంగ్రెస్ యూనివర్సిటీలో ఉన్నానని చెప్పారు.

ముందు ప్రేమించా.. సినిమా స్టైల్లో పెళ్లి జరిగింది..

తన ప్రేమ, వివాహంపై రేవంత్ ఆసక్తికర విషయాలు తెలిపారు. "నాది పెద్దలు చేసిన ప్రేమ వివాహం. ముందు నేను ప్రేమించాను. తర్వాత అది అరేంజ్ మ్యారేజ్‌గా మారింది. నా భార్య గీత ఢిల్లీలోని లేడీ శ్రీరాం కాలేజీలో చదువుకుంది. నేను తెలంగాణలో ప్రభుత్వ బడిలో చదువుకున్నాను. మా పరిచయం ఊహించని విధంగా జరిగింది. విజయవాడలో వాజ్‌పేయి సభ జరిగింది. కొందరితో కలసి నేను హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లాను. తిరిగి వచ్చే క్రమంలో గీత కుటుంబంతో కలిసి నాగార్జున సాగర్‌లో ఆగాం. అక్కడ గీతతో పరిచయం జరిగింది. అది ప్రేమగా మారింది. చివరికి సినిమా స్టైల్‌లో మా పెళ్లి జరిగింది. టైం దొరికితే మనవడితో ఎంజాయ్ చేస్తా" అని చెప్పారు.

ఒక్కసారి కూడా సిగరెట్ తాగలే..

జీవితంలో ఇప్పటివరకు ఒక్కసారి కూడా తాను సిగరెట్ తాగలేదని, అది తన విల్ పవర్ అని రేవంత్ చెప్పారు. తాను టీ కూడా తాగేవాడిని కాదని.. విద్యార్థి ఉద్యమాల్లోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో అలవాటైందని తెలిపారు. తాను ఫుట్‌బాల్ ఆటగాడినని, రాహుల్ గాంధీ దగ్గర సమయం దొరికినప్పుడల్లా.. ఫిట్‌నెస్‌పై సలహాలు, సూచనలు తీసుకుంటానని చెప్పారు.

ఓటుహక్కును కొల్లగొడుతున్న మోదీ

18 ఏళ్లకు ఓటుహక్కు కల్పించిన రాజీవ్‌గాంధీ.. దానిని కాపాడుకునేందుకు కలిసికట్టుగా పోరాడదాం

» 2029 రాహుల్ ప్రధాని అయ్యే సంవత్సరంగా చాటుదాం
» 21 ఏళ్లకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించాలి : రేవంత్‌రెడ్డి
» కేరళలో పాంథువల్ మెరిట్ అవార్డుల ప్రదానోత్సవానికి హాజరు



విద్యార్థినికి పాంథువల్ మెరిట్ అవార్డు అందజేస్తున్న కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశంలో 18ఏళ్లు నిండిన ప్రతి పౌరుడికీ ఓటుహక్కు కల్పించారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ మాత్రం పౌరుల నుంచి ఓటుహక్కును కొల్లగొడుతున్నారని ఆరోపించారు. ప్రతి భారతీయుడి ఓటుహక్కును కాపాడి రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు అందరం కలిసికట్టుగా పోరాడదామని పిలుపునిచ్చారు. 18ఏళ్లకు ఓటు హక్కు కల్పించిన వారికి, ఓటు హక్కును కొల్లగొట్టిన వారికి మధ్యే 2029 ఎన్నికలు జరగబోతున్నాయని తెలిపారు. 2029ని రాహుల్‌గాంధీని ప్రధానిని చేసే సంవత్సరంగా చాటుదామన్నారు. ఆదివారం కేరళలోని అలప్పుళలో ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో జరిగిన పాంథువల్ (ఎంపీ) మెరిట్ అవార్డుల కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీ వేణుగోపాల్ ప్రారంభించిన ఈ అవార్డులు పది, పన్నెండు తరగతుల్లోని విద్యార్థుల్లో అత్యుత్తమ ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడానికి ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. తెలంగాణలో విద్యాభివృద్ధికి పెద్దఎత్తున కృషి చేస్తున్నామని, పేదలకు నాణ్యమైన విద్యనందించాలని సంకల్పించామని తెలిపారు. 55 రోజుల్లో 11,055 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. రాష్ట్రంలో యంగ్‌ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించబోతున్నామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే వయసును 21ఏళ్లకు తగ్గిస్తూ రాజ్యాంగాన్ని సవరించుకోవాలన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ కేవలం యువత శక్తిని నమ్ముకుని పోరాటం సాగిస్తోందన్నారు.

ఆగస్టులో రికార్డు వానలు

» సాధారణం కంటే 75% అధిక వర్షపాతం

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆగస్టులో సాధారణం కంటే 75శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఆగస్టులో సాధారణ వర్షపాతం 21.5సెం.మీ పడాల్సి ఉండగా.. 37.85 సెం.మీ కురిసింది. అంటే రోజుకు సగటున 1.2 సెం.మీ. వాన పడింది. గత ఏడాదితో సగటు పోల్చితే ఈసారి 80శాతం అధిక వర్షపాతం నమోదైంది. కాగా, ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు సాధారణ వర్షపాతం 57.3సెం.మీ నమోదు కావాలి. అయితే ఇప్పటి వరకు 72 సెం.మీ వర్షం కురిసింది. అంటే 26శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఇక రాష్ట్రవ్యాప్తంగా 621 మండలాలుండగా.. 136 చోట్ల అత్యధిక (60% ఎక్కువగా), 238 చోట్ల అధిక (20-59శాతం మధ్య), 221 మండలాల్లో సాధారణ వర్షపాతం, మరో 26 మండలాల్లో 20-60శాతం లోటు వర్షపాతం నమోదైంది. కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా 104 సెం.మీ పడింది. కాగా, రాష్ట్రంలో నేడు, రేపు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది.



సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న పీఆర్‌టీయూ-టీఎస్ ఉపాధ్యాయులు

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

» నేటి ఇందిరాపార్కు మహాధర్నాకు తరలాలి
» పీఆర్‌టీయూ-టీఎస్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ పిలుపు

వికారాబాద్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు భూతంగా పరిణమించిన సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సీపీఎస్‌కు వ్యతిరేకంగా రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు సోమవారం హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద నిర్వహించే మహాధర్నా విజయవంతానికి ఆదివారం వికారాబాద్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. మహాధర్నాకు అన్ని మండలాల నుంచి ఉపాధ్యాయులు, ఉద్యోగులు హాజరు కావాలని చంద్రశేఖర్ కోరారు. 2004 తర్వాత ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయ, ఉద్యోగులకూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం దృష్టికి తెచ్చేలా మహాధర్నాను తలపెట్టామన్నారు. ఉద్యమాన్ని విజయవంతం చేసి పాత పెన్షన్ హక్కు సాధనలో అందరం భాగస్వాములు కావాలని, సీపీఎస్ అంతం పీఆర్‌టీయూ పంతం అనేది చాటిచెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ మండలాలు, జిల్లా, రాష్ట్ర బాధ్యులు, సభ్యులు పాల్గొన్నారు.

పనితీరును బట్టే ప్రజల్లో కీర్తి

» షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ



దశరథ్ దంపతులను సన్మానిస్తున్న ఏసీపీ లక్ష్మీనారాయణ

కడ్తాల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పని తీరును బట్టే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజల్లో కీర్తి లభిస్తుందని షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ అన్నారు. ఉద్యోగ విరమణ పొందుతున్న ప్రభుత్వ ఉద్యోగులు సమాజ సేవకు పునరంకితం కావాలని కోరారు. కడ్తాల పోలీస్‌స్టేషన్‌లో ఐదేళ్లు విధులు నిర్వహించి రిటైర్ అవుతున్న తాటికొండ దశరథ్‌కు ఆదివారం స్టేషన్ ఆవరణలో వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ గంగాధర్ అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమానికి ఏసీపీ హాజరయ్యారు. దశరథ్ దంపతులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ.. అంకితభావంతో పనిచేసే ఉద్యోగులు, అధికారులు ప్రజల అభిమానం చూరగొంటారన్నారు. దశరథ్ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఐలు వరప్రసాద్, చంద్రశేఖర్, వెంకటేశ్, శ్రీకాంత్, ఏఎస్ఐ బాల్‌రెడ్డి, సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, గూడూరు లక్ష్మీనర్సింహ, లాయక్ అలీ, వెంకటేశ్, కృష్ణ, మహేశ్, అంజి, కరుణాకర్, సురేశ్, బిచ్యానాయక్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి కట్టక ఇక్కట్లు

తంగళ్లపల్లి వాగుపై రాకపోకలు బంద్

» చుట్టూ తిరిగి వెళ్తున్న ప్రజలు
» మూడేళ్ల కింద పాత వంతెన కూల్చివేత
» పాలకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జనం



తాత్కాలిక రోడ్డుపై వెళ్తూ వాగులో బోల్తా పడిన డీసీఎం(ఫైల్)

కొందుర్గు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి వాగుకు రెండు మూడు మండలాల క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి నీరొచ్చే ఉధృతంగా ప్రవహించి నల్గొండ జిల్లా డిండి ప్రాజెక్టుకు చేరుతుంది. చిన్న వర్షాలకైనా వాగులో నీటి ప్రవాహం ఉంటుంది. ఈ వాగుపై నిర్మాణాలు చేపట్టాలంటే ఇంజినీరింగ్ అధికారులు నీటి ప్రవాహం, కాలాన్ని బట్టి పనులు చేయాల్సి ఉంటుంది. రెండు జిల్లాలను కలిపే ఆర్అండ్‌బీ రోడ్డు ఈ వాగుపై నుంచే వెళ్తోంది. వాహనాల రద్దీ ఉంటుంది. ఇలాంటి వాగుపై పాతవంతెనను మూడేళ్ల కింద తవ్వి పనులు చేయకుండా వదిలేయడంతో ప్రయాణికులకు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ఏడాది వాగుపై రాకపోకలు పూర్తిగా నిలిచాయి. పెద్ద వాగుపై వంతెన నిర్మాణానికి పాలకులు పట్టించుకోక ఐదారు గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.


రూ.3.2కోట్లతో పనులు చేపట్టి ...

తంగళ్లపల్లి వాగుపై పది మీటర్ల వెడల్పుతో నాలుగు పిల్లర్లపై వాగు నిర్మించాల్సి ఉంది. రోడ్డు పనులు పూర్తయిన మూడేళ్లకు బ్రిడ్జి కోసం రూ.3.2కోట్ల అంచనాతో 2023 జూన్‌లో అప్పటి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పాత వంతెనను కూల్చే సరికే వరదలొచ్చాయి. మట్టిరోడ్డు వేసి పనులు నిలిపేశారు. ఈ లోగా ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడం తదితర కారణాలతో పనులు పడకేశాయి. ఎండకాలంలోనూ పనులు చేయలేదు. తంగళ్లపల్లి వాగుపై బ్రిడ్జి లేక కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడెం మండలాల, మహబూబ్‌నగర్ జిల్లాకు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు అందుబాటులో ఉన్నపుడు రంగారెడ్డి-మహబూబ్‌నగర్ జిల్లాల ప్రయాణానికి కొందుర్గు, కొల్లూరు, నవాబ్‌పేటల మీదుగా వెళ్లేవారు. బ్రిడ్జి నిర్మాణం కాక ఇప్పుడు షాద్‌నగర్, జడ్చర్ల మీదుగా 70కి.మీలకుపైగా అదనంగా తిరగాల్సి వస్తోంది. వెంకిర్యాల, ఆగిర్యాల, లక్ష్మీదేవిపల్లి గ్రామాల వారు వాగు ఉధృతికి నేరుగా కొందుర్గుకు రాలేకపోతున్నారు. 5కిలో మీటర్లు ఉన్న మండల కేంద్రానికి చుట్టూ 15కిలో మీటర్లు తిరిగి చేరుకుంటున్నారు. కొన్ని రోజుల క్రితం విశ్వనాథ్‌పూర్‌నకు చెందిన శంకరయ్యగౌడ్(45) అనే వ్యక్తి కాస్లాబాద్ మీదుగా వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. తంగళ్లపల్లి వాగుపై సాధ్యమైనంత త్వరగా బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మూడేళ్లుగా ఇబ్బందులకు గురవుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కొట్టుకుపోయిన తంగళ్లపల్లి-వెంకిర్యాల తాత్కాలిక కల్వర్టు

ఇబ్బంది పడుతున్నాం.. బ్రిడ్జి నిర్మించాలి



మూడేళ్లుగా వాగు వచ్చే సమయంలో రోడ్డు బంద్దై అవస్థలు పడుతున్నాం. అత్యవసర సమయాల్లో ఆస్పత్రికి వెళ్లాలంటే చుట్టూ తిరిగి పోతున్నాం. పాలకుల నిర్లక్ష్యంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికైనా వాగు ఉధృతి తగ్గగానే బ్రిడ్జి పనులు పూర్తి చేయాలి.

- లింగంగౌడ్, మాజీ సర్పంచ్, వెంకిర్యాల

కాంగ్రెస్‌లో సేవాదళ్ పాత్ర కీలకం

» డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



జాతీయ జెండాను ఎగురవేసిన చల్లా నర్సింహారెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో సేవాదళ్ పాత్ర కీలకమైందని టీయూఎఫ్ఐడీసీ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు గడగుటి హరికృష్ణ, మండల నాయకులు రమాకాంత్ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ జెండాను పీసీసీ మెంబరు దేప భాస్కర్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ తీగల అనితా రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ సేవాదళ్ పార్టీ అభివృద్ధికి పనిచేస్తుందన్నారు. భారత జాతీయ కాంగ్రెస్‌లో ఐదు గ్రాస్ రూట్ సంస్థల్లో కాంగ్రెస్ సేవాదళ్ ఒకటన్నారు. జిల్లా స్థాయిలో మహేశ్వరంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. 1923లో కాకినాడ కాంగ్రెస్ సమావేశంలో బ్రిటిష్ వారిపై పోరాడేందుకు మొదట యువజన సంస్థగా 'హిందుస్థానీ సేవాదళ్'ను స్థాపించారని తెలిపారు. అగ్రనేతలను బ్రిటిష్ పాలకులు జైలులో పెట్టినపుడు ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని అందించేలా సేవాదళ్‌ను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు కాకి ఈశ్వర్, యాదయ్య, కుమార్, జంగయ్య, రాజునాయక్, పాండునాయక్, సుభాన్‌యాదవ్, శ్రీధర్, రాజు, నవీన్‌కుమార్, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్ కల్యాణి

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

కీసర రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుడాలని క్రాంతికీన్ అకాడమీ ప్రిన్సిపాల్ కల్యాణి అన్నారు. ఆదివారం దమ్మాయిగూడలోని మొక్క నాటు-గిఫ్ట్ పట్టు కార్యక్రమంలో గెలిచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ప్రతి పది మందిలో ఒకరిని ఎంపిక చేసి స్టెయిన్‌లెస్ స్టీల్ వాటర్ బాటిళ్లను అందజేశారు. ఒకరికి ప్రత్యేక బహుమతిగా రేంజర్ సైకిల్‌ను ఇచ్చారు. విద్యార్థులు చేసిన మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్రాంతికీన్ ఫౌండేషన్ డైరెక్టర్ పీఎస్ఆర్ క్రాంతి, లావణ్య, ఫౌండేషన్ సభ్యులు సంతోష్, కవిత, సంధ్య, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు సంఘటితం కావాలి



మాట్లాడుతున్న జగన్మోహన్

పరిగి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో రాజ్యాధికారాన్ని సాధించేందుకు ముదిరాజ్ కులస్థులంతా సంఘటితం కావాలని తెలంగాణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు జగన్మోహన్ అన్నారు. ఆదివారం పరిగిలో లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి సమావేశంలో మాట్లాడారు. ముదిరాజ్‌ల జనాభా ప్రకారం హక్కులు పొందాలని, అందుకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఆరు శాతం జనాభా ఉన్న సామాజిక వర్గానికి రాష్ట్రంలో 42మంది ఎమ్మెల్యేలు ఉన్నారని, 15శాతం జనాభా ఉన్న ముదిరాజ్‌ల నుంచి ఒక్క ఎమ్మెల్యేనే ఉన్నారని తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 20మంది మాత్రమే ముదిరాజ్ ఎమ్మెల్యేలయ్యారని, రెడ్లు మాత్రం 422 మంది అయ్యారని తెలిపారు. ముదిరాజ్ కులం అణచివేతకు గురవుతోందన్నారు. నిజాయితీకి మారుపేరైన ముదిరాజ్‌లను రాజకీయ పార్టీలు చిన్నచూపు చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముదిరాజ్‌లలో ఎన్ని సంఘాలున్నా హక్కుల కోసం కలసిరావాలని కోరారు. స్థానిక ఎన్నికల్లో ఎక్కువ స్థానాల్లో ముదిరాజ్‌లు గెలిచేలా ప్రయత్నాలు జరుగాలన్నారు. సర్పంచ్, ఎంటీసీలు స్థానాలు గెలుచుకుంటే ఎమ్మెల్యేలుగా గెలిచే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి జూపల్లి రామస్వామి, మహిళా అధ్యక్షురాలు లక్ష్మీ, జిల్లా అధ్యక్షురాలు స్వరూపరాణి, మెపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకటయ్య, పాలమూరు జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్, పరిగి తాలుకా అధ్యక్షకార్యదర్శులు టి.రామస్వామి, శ్రీశైలం, ఉపాధ్యక్షుడు శేరి బిచ్చన్న, నాయకులు కె.రామకృష్ణ, పి.చిన్ననర్సింహులు, చంద్రలింగం, చందు, ప్రకాష్, బసప్ప, వీరన్న,నర్సింహులు,లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



బారికేడ్లను అందజేస్తున్న కురుమ సంఘం నాయకులు

బారికేడ్లు సమకూర్చడం అభినందనీయం

కందుకూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్‌కు బారికేడ్లను అందజేయడం అభినందనీయమని సీఐ సీతారాం అన్నారు. కందుకూరు గ్రామ కురుమ సంఘం అధ్యక్షుడు పాముల శ్రీశైలం, గ్రామ నాయకులు ఎగ్గిడి రాజులు సమకూర్చిన బారికేడ్లను కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.శంకర్, జిల్లా అధ్యక్షుడు ఎస్.దశరథ్‌లతో కలిసి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం బారికేడ్లను ఏర్పాటు చేశారు. సీఐ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు చేపట్టడానికి యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి, నాయకుడు ఎగ్గిడి సత్తయ్య, మండల శాఖ అధ్యక్షుడు అచ్చన్న పాండు కురుమ, నాయకులు ఎస్.శ్రీను, ఎగ్గిడి జగదీశ్వర్ కురుమ, ఎగ్గిడి పెద్దఐలయ్య, కందడి చంద్రయ్య, ఎగ్గిడి చిన్న ఐలయ్య, ఎ.మల్లేష్, బాలయ్య, బీరప్ప, నర్సింహ, గణేష్, శంకర్, వెంకటేష్, జంగయ్య, రామస్వామి, నర్సింహ, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

అడుగుకో గుంత.. ప్రయాణమెట్లా?

- పట్టించుకోని అధికారులు, పాలకులు
- వాహనదారులకు తప్పని ఇబ్బందులు



చేవెళ్ల మండలం ఆలూర్‌కు వెళ్లే రోడ్డుపై ఏర్పడిన గుంతలు

చేవెళ్ల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం పాలకుల అలసత్వంతో గ్రామీణ ప్రజలు నిత్యం ఇబ్బంది పడుతున్నారు. చేవెళ్ల మండల పరిధిలోని ఆలూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ రోడ్డుపై అడుగుకో గుంత, కొన్నిచోట్ల చేపల చెరువులు దర్శనమిస్తున్నాయి. దాంతో వాహన దారులు, పాదచారులు గుంతల రోడ్డుపై భయపడుతూ ప్రయాణాలు సాగిస్తున్నారు. ద్విచక్రవాహనదారులు రోడ్డుపై గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నామని ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని దేవరంపల్లి వయా ఆలూర్ గ్రామం నుంచి శంకర్‌పల్లి వెళ్లే రోడ్డు వరకు ఆర్అండ్‌బీ శాఖ రోడ్డు మరమ్మతుల కోసం రెండు సంవత్సరాల క్రితమే నిధులు రూ.కోటి 15 లక్షలు మంజూరు చేసింది. అయితే, పనులు మాత్రం ముందుకు సాగడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా, ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా గుంతలు పెద్దవిగా మారాయి. రోడ్డు ప్రయాణం నరకంగా మారిందని ఆలూర్ గ్రామస్తులు వాపోతున్నారు. గుంతల రోడ్డును బాగు చేయడంలో ఆర్అండ్‌బీ శాఖ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని వాహనదారులు మండి పడుతున్నారు. రోడ్డును బాగు చేసేది ఎన్నడో అని ఆలూరు గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డును బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

బోరు మోటార్ల కేబుల్ అపహరణ

- కందుకూరు మండలం దాసర్లపల్లిలో ఘటన
- 15 చోట్ల దొంగిలించిన దుండగులు

కందుకూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసర్లపల్లి గ్రామంలో శనివారం రాత్రి వ్యవసాయ క్షేత్రాల్లోని బోరు మోటార్ల వద్ద కేబుల్‌ను గుర్తుతెలియని దుండగులు దొంగిలించారు. ఒకేరాత్రి 15 చోట్ల కేబుల్‌ను దొంగిలించడంతో రైతులు భయాందోళనలో ఉన్నారు. వారం క్రితం ఇదే గ్రామంలో సుమారు ఐదు బోర్ల వద్ద విద్యుత్ వైర్లలోని రాగి వైర్‌ను దుండగులు దొంగిలించినట్లు రైతులు తెలిపారు. ఈక్రమంలో శనివారం గ్రామానికి చెందిన రైతులు బొక్క ప్రతాప్‌రెడ్డి, బొక్క ప్రకాశ్‌రెడ్డి, బొక్క శ్రీనివాస్‌రెడ్డి, దస్తగిరి, ఎండీ ఖాదర్ వ్యవసాయ క్షేత్రాల్లో సుమారు రూ.50 వేల విలువైన కేబుల్‌ను దుండగులు దొంగిలించారు. ఆదివారం ఉదయం బాధిత రైతులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ సీతారాం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- ఏడుగురిపై కేసు.. రూ.37,900 స్వాధీనం

చేవెళ్ల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ఎస్సై తేజశ్రీ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గుండాల గ్రామంలో శనివారం రాత్రి ఓ వ్యవసాయ పొలం వద్ద కొందరు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్నారు. ఈమేరకు రాజేంద్రనగర్ ఎస్వోటీ పోలీస్‌లు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకొని చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఏడుగురిపై కేసు నమోదు చేసి వారి నుంచి రూ.37,990 నగదుతో పాటు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తేజశ్రీ తెలిపారు.

స్కూటీని ఢీకొన్న లారీ.. వ్యక్తి దుర్మరణం

- యాక్టివాను రెండు కిలోమీటర్లు లాక్కెళ్లిన టిప్పర్ లారీ
- డ్రైవర్‌ను పట్టుకొని పోలీసులకు అప్పగించిన స్థానికులు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): స్కూటీని టిప్పర్ లారీ ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆదివారం శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూర్ మండలం, కుమ్మరిగూడకు చెందిన రాజేష్‌గౌడ్ ఇటీవల శంషాబాద్‌లో స్నాక్స్ సెంటర్ ప్రారంభించాడు. నిత్యం సెంటర్‌కు వెళ్లి వస్తూ ఉండేవాడు. ఈక్రమంలో ఆదివారం రాత్రి 8గంటల సమయంలో శంషాబాద్ నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా మున్సిపల్ పరిధిలోని తొండుపల్లి వద్ద రాంగ్‌రూట్‌లో వేగంగా వచ్చిన టిప్పర్(టీఎస్ 07 యూజే 8791) డ్రైవర్ హోండా యాక్టివాను ఢీకొన్నాడు. దాంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా, యాక్టివా లారీ చక్రాల మధ్య ఇరుక్కుపోవడంతో దాదాపు రెండు కిలోమీటర్ల వరకు లాక్కెళ్లగా స్థానికులు వెంబడించి టిప్పర్‌ను పట్టుకుని డ్రైవర్‌ను పోలీసులకు అప్పగించారు. మృతదేహం, స్కూటీ నుజ్జునుజ్జయింది. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

తలకొండపల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం అవసరమైతే ఆమరణ నిరహార దీక్ష ప్రారంభిస్తామని గట్టిప్పలపల్లి జేఏసీ నాయకులు ప్రకటించారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు ఆదివారం 302వ రోజుకు చేరాయి. రాష్ట్రప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసే 11 మండలాల జాబితాలో గట్టిప్పలపల్లిని చేర్చాలని నాయకులు, యువకులు డిమాండ్ చేశారు. పాలక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలన్నారు. లేని యెడల ఎంతటి పోరాటానికైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు.

రాహుల్ గాంధీ వ్యాఖ్యలు సిగ్గుచేటు

- బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి గౌండ్ల కావ్య కృష్ణగౌడ్
- నాయకుల నిరసన ర్యాలీ
- రాహుల్ దిష్టిబొమ్మల దహనం



చేవెళ్ల : కావ్య కృష్ణగౌడ్‌ను హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

చేవెళ్ల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్రమోదీ మాతృమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలు సిగ్గుచేటని, తక్షణమే క్షమాపణ చెప్పాలని బీజేపీ మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి గౌండ్ల కావ్య కృష్ణగౌడ్ డిమాండ్ చేశారు. బీజేపీ పిలుపు మేరకు నగరంలో నిర్వహించే ధర్నాకు వెళ్లకుండా బీజేపీ నాయకులను పోలీస్‌లు ఆదివారం ముందస్తుగా హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిహార్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్రమోదీపై, అతని తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్ గాంధీ తక్షణమే క్షమాపణ చెప్పాల, రాహుల్ తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. మరోమారు ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేస్తే దేశంలోని మహిళలు తగిన విధంగా కాంగ్రెస్ నేతలకు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.



ఆమనగల్లు : రాహుల్ గాంధీ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

మాడ్గుల : ప్రధాని నరేంద్రమోదీ, మాతృమూర్తిపై రాహుల్‌గాంధీ అనుచిత వాఖ్యలు సిగ్గుచేటని బీజేపీ మండలాధ్యక్షుడు నల్లకాసుల పెద్దయ్య యాదవ్ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. పోలీసులు వచ్చి మంటలను చల్లార్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎరుకలి కాటం, సిరగోని అంజయ్య,పల్లేటి జగన్, మెట్టు శ్రీను, ఏర్పుల సైదులు భూపేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : బిహార్‌లో ఓటరు అధికార్ యాత్ర సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ మాతృమూర్తిపై రాహుల్ గాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలపై బీజేపీ నాయకులు మండిపడ్డారు. ఆమనగల్లు పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు ఎర్రవోలు శ్రీనుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు కండె హరిప్రసాద్ హాజరయ్యారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయరహదారిపై కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నాయకులు, కార్యకర్తలు నిరసన ర్యాలీ చేపట్టారు. రాజీవ్ చౌక్‌వద్ద రాహుల్ దిష్టి బొమ్మను దహనం చేశారు. జిల్లా, మండల నాయకులు చెక్కాల లక్ష్మణ్, శ్రీకాంత్ సింగ్, గోరటి నర్సింహ్మా, భగవాన్ రెడ్డి, చెన్నకేశవులు, కృష్ణ యాదవ్, శ్రీను, జంగయ్య, మహేశ్, లండం మల్లేశ్, బాలునాయక్, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : మండల కేంద్రంలో బీజేపీ నాయకులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ చేపట్టారు. జాతీయ రహదారిపై రాహుల్ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ దళితమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు నింగ్యారి యాదగిరి, బీజేపీ మండలాధ్యక్షుడు దోనాదుల మహేశ్, ఎస్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు.

తలకొండపల్లి : మండల కేంద్రంలో బీజేపీ నాయకులు రాహుల్ వ్యాఖ్యలను నిరసిస్తూ ఆందోళన కార్యక్రమం చేపట్టారు. బీజేపీ మండలాధ్యక్షుడు రవిగౌడ్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించి రాహుల్ దిష్టిబొమ్మను దహనం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గోరటినర్సింహ, నాయకులు పాండు ప్రసాద్, బక్కికుమార్, పెరుమాళ్ల రాజు, నీలకంఠ పాండు, అనిల్, బాలకృష్ణ, హర్యనాయక్, జహంగీర్, శ్రీశైలం, మహేశ్, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల : నిరసన కార్యక్రమంలో బీజేపీ నేతలు

పల్లెల్లో స్థానిక సందడి

(ఐదో పేజీ తరువాయి)

అంచనాకు వచ్చిన కొందరు నేతలు అప్పుడే అస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. అధికార యంత్రాంగం కూడా ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. ఇప్పటికే ఓటర్ల ముసాయిదా జాబితాలను గ్రామ పంచాయతీలలో ప్రదర్శించి, పోలింగ్ బూత్‌లను సిద్ధం చేస్తుండడంతో రాజకీయ పార్టీలు కూడా శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నాయి.

రిజర్వేషన్లపై ఆందోళన

స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లపై సర్వత్ర ఉత్కంఠ నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల కల్పనకు అసెంబ్లీలో బిల్లు ఆమోదం, 50 శాతం రిజర్వేషన్ల పరిమితి తొలగింపు బిల్లు ఆమోదించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేష న్లు మారే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. దీంతో తమకు అవకాశం లభిస్తుందన్న ధీమాలో ఆశావాహులున్నారు. ప్ర భుత్వ నిర్ణయం మేరకు ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించిన అనంతరం సర్పంచ్‌లవి నిర్వహించనున్నట్లు తెలుస్తుంది. సర్పంచ్ పదవికి పార్టీ బీ-ఫామ్ ఉండదు కాబట్టి ఎక్కువ మంది పోటీ పడి బరిలో నిలిచే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు ముందుగా నిర్వహిస్తే గ్రామ స్థాయిలో వివాదాలకు దారితీసే అవకాశం ఉందని.. ఈ నేపథ్యంలో ఇబ్బందులు తప్పవన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. బీసీ రిజర్వేషన్ బిల్లు జీవో ఆమోదంతో.. బీసీ సామాజిక వర్గాలు తమకు ఎక్కువగా అవకాశాలు లభిస్తాయనే ఆనందంలో ఉన్నారు.

ప్రజాప్రతినిధులు లేక పడకేసిన పాలన

గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం 2024 జనవరి 30న, జిల్లా, మండల పరిషత్‌ల పదవీకాలం జూలై 4న ముగిసింది. సర్పంచ్‌లు, వార్డు సభ్యులు లేకపోవడంతో 20నెలల కాలంగా గ్రామాలలో అభివృద్ధి కొంత మేర కుంటుపడింది. పంచాయతీ సిబ్బందిపై కూడ పర్యవేక్షణ కొరవడింది. పంచాయతీల నిర్వహణ కార్యదర్శులకు ఒకింత భారంగా మారింది. మరోవైపు స్థానిక సంస్థల పాలన ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లింది. గ్రామ పంచాయతీలకు, అన్ని మండలాలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. సెప్టెంబర్ నెల చివరి వరకు సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని ఇప్పటికే హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో ఎన్నికల నిర్వహణకు చకచకా ఏర్పాట్లు చేస్తుంది.

చేపల పెంపకానికి ప్రోత్సాహం

(ఐదో పేజీ తరువాయి)

మత్స్యకారులకు సాంఘిక, భౌతిక, ఆర్థిక భద్రతలను కల్పించడంతో పాటు చేపల ఎగుమతులను ప్రోత్సహించడం, విలువ ఆధారిత పద్ధతులను ఆధునికీకరించి బలోపేతం చేయడం లక్ష్యంగా ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజనను అమలు చేస్తున్నారు.

వంద శాతం ఎస్టీలు ఉన్న పంచాయతీలు ఇవే

2011 ప్రకారం జిల్లాలోని రాజేంద్రనగర్, మహేశ్వరం, చేవెళ్ల, షాద్‌నగర్, కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గాలోని 21 మండలాల్లోని 60 తండాలు ఉన్నాయి. ఇవన్నీ వంద శాతం ఎస్టీ గ్రామ పంచాయతీలే. ఈ గ్రామ పంచాయతీలనే ప్రధాన మంత్రి మత్స్యసంపద యోజన పథకం ద్వారా ఎంపిక చేశారు. 60 తండాల్లో మొత్తం 43,887 మంది ఎస్టీలు ఉన్నారు. అందులో 22,868 మంది పురుషులు, 21,019 మంది మహిళలు ఉన్నారు. శంషాబాద్ మండలంలోని ఆలికోలి తండా, మదనపల్లి కొత్త తండా, మదనపల్లి పాత తండా, పెద్దతూప్రాతండా, పెద్దషాపూర్ తండాలో మొత్తం 771 మంది ఎస్టీలు ఉన్నారు. కందుకూరు మండలంలోని దవుద్‌గూడ, పెద్దమ్మ, దర్శన్‌పల్లి తండాలలో 1,643 మంది, కొందుర్గు మండలంలోని అయోధ్యపూర్ తండాలో 743మంది. జిల్లేల చౌదరిగూడ మండలంలోని తింతకుంట, ధర్యాతండాలలో 1,719మంది ఎస్టీలు ఉన్నారు. అలాగే మహేశ్వరం మండలంలోని పడమటి, కొత్తాల్ చెరువు, గాగుల్‌దోమి తండాలలో 2,354 మంది, తలకొండపల్లి మండలంలోని హరియానాయక్, పాతకోట, పడమటి, గడ్డమీది, ఫుల్‌సింగ్, తుమ్మలకుంట తండాలలో మొత్తం 5,487 మంది ఎస్టీలు ఉన్నారు. కడ్తాల్ మండలంలోని రేక్యాతండా, బాలాజీ నగర్ తండా, గోవిందయ్యపల్లి తండా, గంగుమర్ల తండా, గడ్డమీది తండా, పెద్దమేములోయిబాయి తండా, కొంద్రిగండుబోడు తండా, పెల్లచెల్క తండా, నర్కొండ తండాలో 6,373 మంది, ఆమనగల్లు మండలం శంకర్‌కొండ తండాలో 764 మంది ఎస్టీలున్నారు. యాచారం మండలంలోని కేసితండా, టక్కలపల్లి తండాలో మొత్తం 1,518 మంది, కేశంపేట మండలంలోని దేవునిగుడి తండా, తూర్పుగడ్డ తండా, పొలకొనిగుట్ట తండాలో మొత్తం 2,036 మంది ఎస్టీలు ఉన్నారు. కొత్తూరు మండలంలోని కొడిచర్ల తండా, ఏనుగు మదుగుల తండా, మాలాపూర్ తండాలో 2,500 మంది నందిగామ మండలంలోని చాకలిదానిగూడ తండాలో 924 మంది ఎస్టీలు జీవనం సాగిస్తున్నారు. ఫరూక్‌నగర్ మండలంలోని మేలగూడ, దొంతికుంట, చౌదమ్మగుట్ట, గిరాయిగుట్ట, ఫుల్బర్ల కుంట, కడియాలకుంట, కుందేల్‌కుంట, దేవునిబండ, మొండోని రాయి, యెంకన్నగూడ తండాలలో మొత్తం 6,976 మంది ఎస్టీలు ఉన్నారు. మంచాల మండలం పటేల్‌చెరు తండాలో 1,091 మంది, మాడ్గుల మండలంలోని కట్రగాని తండా, గుడి తండా, పకీర్ తండా, జయరాం తండా, పల్లె తండా, పలుగు తండా, జర్పుల తండాలో 5,070 మంది ఎస్టీలు ఉన్నారు.

ఎస్టీలకు 90 శాతం రాయితీ



ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ద్వారా కేంద్ర ప్రభుత్వం చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తుంది. చేపల పెంపకానికి ఆసక్తి ఉన్న ఎస్టీలకు 90 శాతం రాయితీపై 15 రకాల యూనిట్లను అందిస్తున్నాం. జిల్లాలో ఇందు కోసం వంద శాతం ఎస్టీలున్న గ్రామ పంచాయతీలను ఎంపిక చేశాం. 60 గ్రామాల్లోని ఎస్టీలకు ఈ పథకాన్ని వర్తింప చేస్తున్నాం. ఎస్టీల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాం.

- పూర్ణిమ, జిల్లా మత్స్యశాఖ అధికారి

గణనాథుడికి పూజలు.. నిమజ్జనాలు

గణనాథుడు భక్తులచే విశేష పూజలు అందుకుంటున్నాడు. యువజన సంఘాలు, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. విఘ్నాలు తొలగి, వర్షాలు సమృద్ధిగా కురవాలని భక్తులు విఘ్నేశ్వరుడిని వేడుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా పలుచోట్ల ఆదివారం వినాయకుల నిమజ్జనాలు నిర్వహించారు. కొందరు లడ్డూలను వేలంలో దక్కించు కున్నారు. భక్తులు పాటలు పాడుతూ, కోలాట మాడుతూ గణేశుడి శోభాయాత్ర నిర్వహించారు. పలు వినాయక మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారులకు కుర్చీలాట నిర్వహించి బహుమతులు అందించారు.



మంచాల : బస్టాండ్ చౌరస్తాలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నిర్వహించిన హోమంలో భక్తులు



రంగారెడ్డి అర్బన్ : కలెక్టరేట్‌లో నెలకొల్పిన గణేశుడిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



షాబాద్ : మద్దూర్ వద్ద గణనాథుడి పూజలో వాసుదేవ రియల్టర్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ సునీతప్రసాద్ తదితరులు



చేవెళ్ల : కోర్టు ఆవరణలో నిమజ్జనం సందర్భంగా న్యాయవాదులు



కొత్తూర్ : శ్రీరామ్‌నగర్‌లోని వినాయక మండపం వద్ద అన్నదానం చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు దేవేందర్‌యాదవ్

రైతుబజార్‌లో మౌలిక సౌకర్యాలు కల్పించాలి



రైతుబజార్‌ను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

చేవెళ్ల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైతు బజార్‌లో రైతులకు అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి, మండల కార్యదర్శి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. ఆది వారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని రైతుబజార్‌ను వారు పరిశీలించారు. రామస్వామి మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా చేవెళ్ల మున్సిపల్ అధికారులు చిరువ్యాపారులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. రైతులకు తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేదన్నారు. చిరువ్యాపారులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. అధికారులు స్పందించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నాయకులు ప్రభులింగం, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.


జైపాల్‌రెడ్డికి నాయకుల పరామర్శ

ఆమనగల్లు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తిగత సహాయకుడు వెల్దండ జైపాల్ రెడ్డిని ఆదివారం ఆమనగల్లు మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, పిరమిడ్ చైర్మన్ కోర్పోలు విజయభాస్కర్‌రెడ్డి, సీజీఆర్ చైర్మన్ లక్ష్మారెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, బీచ్యనాయక్‌లు పరామర్శించారు. జైపాల్‌రెడ్డి తండ్రి రాంచంద్రారెడ్డి ఇటీవల మృతిచెందాడు. తిరుమలాపూర్‌లో మృతుడి కుమారులు యాదవరెడ్డి, లక్ష్మారెడ్డి, జైపాల్‌రెడ్డి, కూతురు అలివేలమ్మలను పరామర్శించారు. రాంచంద్రారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు.

అస్మత్‌పాషాకు భీంభరత్ పరామర్శ

షాబాద్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న షాబాద్ మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అస్మత్‌పాషాను చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, నాయకులు రవీందర్‌రెడ్డి, చల్లా మాధవరెడ్డిలు ఆదివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పార్టీ అండగా ఉంటుందని, దిగులు పడాల్సిన అవసరం లేదన్నారు. త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

మోదీ సందేశాన్ని వీక్షించాలి



కొందుర్గు : మన్‌కీ బాత్‌ను వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

కొత్తూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రతీనెల చివరి ఆదివారం నిర్వహించే ప్రధాని మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ప్రతీఒక్కరు వీక్షించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పెంజర్లలో కార్యకర్తలతో కలిసి మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. నాయకులు మంగలి రమేష్, ఇంద్రసేనరెడ్డి, వనం జంగయ్య, మురళి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమం వీక్షణకు ఆమనగల్లు పట్టణంలో బీజేపీ నాయకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి వీక్షించారు. రాష్ట్ర నాయకుడు కండె హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోరటి నర్సింహ, ఆమనగల్లు మండలాధ్యక్షుడు ఎర్రవోలు శ్రీను, మున్సిపాలిటీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, చెక్కాల లక్ష్మణ్, చెన్నకేశవులు, ఆనంద్, మల్లేశ్, పరమేశ్, తదితరులున్నారు.

కొందుర్గు : మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ మండలాధ్యక్షుడు చిట్టెం లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు వీక్షించారు. మనోహర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, సందీప్, నిరంజన్, భరత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల : మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అనంతరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు వీక్షించారు. నాయకులు కృష్ణగౌడ్, అభిలాష్‌రెడ్డి, వెంకటేశ్, అశోక్, రఘునాథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కేశంపేట : దేవునిగుడి తండాలో బీజేపీ నాయకులు మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. నాయకుడు రాజునాయక్ స్వగృహంలో టీవీలో మన్‌కీ బాత్ వీక్షించారు. ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహ యాదవ్, ఎలక్షన్స్ మండల కన్వీనర్ కంచుకోట మహేష్, మండల ప్రధాన కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షుడు నరసింహులు, ఎస్టీ మోర్చా నాయకుడు రాజు నాయక్, గోపాల్ రెడ్డి, కుమారస్వామి, కృష్ణ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, ఆకుల గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

'అంత్యోదయ' లక్ష్యంతో బీజేపీ పాలన

అంత్యోదయ లక్ష్యంతో సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా బీజేపీ పాలన సాగిస్తుందని ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు పసుల నరసింహ యాదవ్ తెలిపారు. కేశంపేట మండలం పోమాల్‌పల్లి, తొమ్మిదిరేకుల, దేవునిగుడి తండాలలో ఆదివారం కేంద్ర పథకాలకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందిస్తూ వివరించారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు.